# సాక్షి

# అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 27 । నవంబర్ । 2023




## బొర్రాకు పర్యాటకుల తాకిడి

అనంతగిరి మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. 8లో



## ఘనంగా శోభాయాత్ర

పవిత్ర పుణ్యస్థలం అయోధ్యలో శ్రీరామునికి పూజ చేసిన అక్షింతలు ఆదివారం జిల్లా కేంద్రం పాడేరు చేరుకున్నాయి. 8లో



## ఉష్ణోగ్రతలిలా..

పాడేరు: చింతపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్‌లో 16.5, మినుములూరు, అరకు కేంద్ర కాఫీబోర్డుల వద్ద 17డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

## న్యూస్‌రీల్

### రావణాపల్లిలో టీటీడీ ఆస్థాన గాయని జ్యోతిర్మయి



అల్లూరి సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న జ్యోతిర్మయి, థార్మిక సంస్థల సభ్యులు

**కొయ్యూరు:** తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి ఆదివారం రావణాపల్లిలో రామలయం, దుర్గమ్మ ఆలయాన్ని సందర్శించారు. గ్రామవీధుల్లో రామనామం నినదించారు. ఈపర్యటనలో భాగంగా ఆమె కృష్ణదేవిపేటలోని అల్లూరి సమాధిని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్లూరి లాంటి మహానీయుడు నడయాడిన ప్రాంతంలో పర్యటించడం ఆనందంగా ఉందన్నారు. సోమవారం చింతపల్లి మండలం తాజంగి వద్ద దొంతులమ్మ తల్లికి హారతి కార్యక్రమంలో పాల్గొంటున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో థార్మిక సంస్థల సేవా ప్రతినిధి డీవీడీ ప్రసాద్, హైందవ సైన్యం జిల్లా అధ్యక్షుడు కంకిపాటి గిరిబాబు, సమరసత సేవా ఫౌండేషన్ సంస్కృతి ప్రముఖ్ కొండబాబు, మండల కన్వీనర్ శ్రీను, మహిళా కన్వీనర్ వరలక్ష్మి, వీహెచ్‌పీ ధర్మప్రచారక్ ఈర్లె మల్లిబాబు పాల్గొన్నారు.

### గంజాయి పంట ధ్వంసం



గుర్రాలతోటలో ధ్వంసం చేసిన గంజాయి మొక్కలకు నిప్పంటించిన పోలీసులు

**హుకుంపేట:** మండలంలోని తీగలవలస పంచాయతీ గుర్రాలతోట గ్రామంలో ఆదివారం రెండు ఎకరాల్లో గంజాయి పంటను ధ్వంసం చేసినట్టు ఎస్‌ఐ సతీష్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించి ధ్వంసం చేసిన గంజాయి మొక్కలకు నిప్పంటించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గంజాయి సాగుకు కారకులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి సాగుకు, రవాణాకు దూరంగా లేకుంటే చర్యలు తప్పవని ఆయన సూచించారు. దాడుల్లో పాడేరు ఎస్‌ఐ రంజిత్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.


### ఆకట్టుకున్న దీపారాధన



విశ్వనాథుని ఆలయంలో దీపారాధన

**వై.రామవరం:** కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని మండలంలోని గురమంద విశ్వనాథుని ఆలయం వద్ద ఆదివారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సర్పంచ్ పల్లాల పద్మావతితోపాటు పలువురు భక్తులు విచ్చేసి కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ కమిటీ సభ్యులు పల్లాల వెంకటరమణారెడ్డి, పల్లాల పండురెడ్డి, శిరిబాల సోమయ్య, వెలుగూరి ప్రభాకరరెడ్డి, మంగాయమ్మ పాల్గొన్నారు.

### మావోయిస్టుల పేరిట కరపత్రాలు



ఏడుగురాళ్లపల్లిలో మావోయిస్టుల పేరిట వెలసిన కరపత్రం

**చింతూరు:** మండలంలోని ఏడుగురాళ్లపల్లిలో ఆదివారం మావోయిస్టుల పేరిట కరపత్రాలు వెలిశాయి. భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు జిల్లాల కమిటీ పేరుతో వెలసిన ఈ కరపత్రాల్లో 23వ పీఎల్‌జీఏ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని మావోయిస్టులు పేర్కొన్నారు. విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి తలపెట్టిన డ్రోన్, కమాండో, హెలికాప్టర్, బాంబు దాడులను తిప్పికొట్టి ప్రజలను రక్షించుకుందామని, బూటకపు ఎన్‌కౌంటర్లను వ్యతిరేకించాలని వారు పేర్కొన్నట్టుగా కరపత్రాల్లో ఉన్నాయి.

# మన్యం.. బంతి పూలవనం

గిరి రైతులకు మంచి రోజులు వచ్చాయి. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున బంతిసాగులో మంచి దిగుబడులు సాధించారు. మార్కెట్లో కూడా గిట్టుబాటు ధర లభించడంతో అధిక ఆదాయం పొందుతున్నారు.

- భారీగా దిగుబడి
- పాడేరు కేంద్రంగా జోరుగా వ్యాపారం
- తెలుగు రాష్ట్రాల్లోని పట్టణాలకు ఎగుమతి
- మార్కెట్లో కిలో రూ.50కు పైగానే..
- మంచి ఆదాయం పొందుతున్న గిరి రైతులు, వ్యాపారులు



ఎగుమతి చేసేందుకు సిద్ధం చేస్తున్న బంతిపూలు



ట్రేలలో నింపుతున్న బంతిపూలు

**సాక్షి,పాడేరు:** మన్యంలో పండించే బంతి పూలకు తెలుగు రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. సీజన్ ప్రారంభం కావడంతో ఇరు రాష్ట్రాల వ్యాపారులు గిరిజనుల నుంచి పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. రాష్ట్రంలోని విజయవాడ, ఒంగోలు, రాజమండ్రి ప్రాంతాల్లో కిలో రూ.50, తెలంగాణలో రూ.60 ధర లభిస్తోంది. అక్కడి వ్యాపారుల ఆర్డర్ మేరకు స్థానిక వ్యాపారులు గిరిజన రైతుల నుంచి భారీగా బంతిపూలను కొనుగోలు చేస్తున్నారు.

**ఊపందుకున్న వ్యాపారం**

కార్తీక మాసం ప్రారంభమైన నాటి నుంచి పాడేరు పాతబస్టాండ్‌లో పూల వ్యాపారం ఊపందుకుంది. బుట్ట పూలను డిమాండ్ బట్టి రూ.100 నుంచి రూ.150కు వ్యాపారులు కొనుగోలు చేసి మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆర్టీసీ పార్శిల్ సేవలను పూల వ్యాపారులు వినియోగించుకుంటున్నారు. ఈ ఏడాది దిగుబడి బాగుండటంతో గిరి రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

**మరో 20 రోజులపాటు వ్యాపారం :** జిల్లాలోని పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు మండలాల్లో సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో బంతి సాగు చేపట్టారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో బంతి తోటలు విరగబూశాయి. పూల అమ్మకాల ద్వారా గిరి రైతులు రోజుకు రూ.వెయ్యి వరకు ఆదాయం పొందుతున్నారు. వ్యాపారులు కూడా మంచి ఆదాయం పొందుతున్నారు. బుట్టకు రూ.30 వరకు లాభం వస్తోందని వారు తెలిపారు. మరో 20 రోజులపాటు వ్యాపారం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

### ఆర్డర్‌కు తగ్గట్టుగా సరఫరా



కార్తీకమాసం కావడంతో మైదాన ప్రాంతాల్లో బంతి పూలకు భారీ డిమాండ్ ఉంది. అక్కడ వ్యాపారులు ఆర్డరు మేరకు గిరి రైతుల నుంచి పూలు కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నాం. బంతి పూల వ్యాపారం బాగానే సాగుతోంది.

– వెంకట అప్పారావు,
పూల వ్యాపారి, పాడేరు

### ధర చాలా బాగుంది



పూలధర ఆశాజనకంగా ఉన్నందున రోజువారీ మంచి ఆదాయం వస్తోంది. పూల దిగుబడి అధికంగా ఉండడంతో ప్రతిరోజు సేకరించి విక్రయిస్తున్నాం. దసరా సమయంలో బుట్ట పూలు రూ.200కు విక్రయించా. ఇప్పుడు రూ.100 నుంచి రూ.150కు కొంటున్నారు.

– కిల్లో పుణ్యవతి,
గిరి రైతు, పాటిమామిడి, హుకుంపేట మండలం

# రూ.8 లక్షలతో అల్లూరి కాంస్య విగ్రహం

- పాఠశాలకు సమకూర్చిన పూర్వ విద్యార్థి ముదునూరి సూర్యనారాయణరాజు
- పలువురి అభినందన



ఉన్నత పాఠశాలకు అల్లూరి విగ్రహాన్ని బహూకరించిన సూర్యనారాయణరాజు

**రాజవొమ్మంగి:** స్థానిక శ్రీఅల్లూరి సీతారామరాజు జెడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి ముదునూరి సూర్యనారాయణరాజు (1976–77) ఆదివారం అల్లూరి సీతారామరాజు 7.5 అడుగుల ఎత్తయిన భారీ కాంస్య విగ్రహాన్ని బహూకరించారు. భారీ వాహనంలో తీసుకువచ్చి పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేశారు. వచ్చేనెల 16వ తేదీన జరగనున్న పాఠశాల స్వర్ణోత్సవాల నేపథ్యంలో బహూకరించినట్టు ఆయన పేర్కొన్నారు. ఆరోజు ఉదయం విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందన్నారు. కుటుంబ సభ్యులు, వ్యాపారంలోని స్నేహితులు ఇచ్చిన మొత్తానికి కొంత నగదు జోడించి రూ.8 లక్షలతో ఈ విగ్రహాన్ని రూపొందించినట్టు ఆయన తెలిపారు. తాను చదువుకున్న పాఠశాలకు ఎంతో కొంత మేలు చేయాలన్న తపనతో ఈ విగ్రహాన్ని ఇచ్చానన్నారు. తాను నిర్మాణ రంగంలో హైదరాబాద్‌లో స్థిరపడినప్పటికీ తమ కుటుంబానికి ఈప్రాంతంతో ఎంతో అనుబంధం ఉందన్నారు. ఆయనను పూర్వ విద్యార్థులు శివరామచంద్రరాజు, అప్పారావు, సీతారామరాజు, శ్రీనివాస జీవన్, కృష్ణవర్మ, సూరిబాబు, శివాజీరాజు, బషీరా, నీలవేణి అభినందించారు.



## భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి 8లో

ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో 108 దీపాల కుందెను ప్రారంభిస్తున్న భక్తులు

# నేటి నుంచి రాగుల కొనుగోళ్లు

- జిల్లా వ్యాప్తంగా 25 కేంద్రాల ఏర్పాటు
- రూ.38.46 ధర ప్రకటించిన ప్రభుత్వం
- 3 వేల నుంచి ఐదు వేల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం



రాగుల పైరు

**సాక్షి,పాడేరు:** గిరి రైతుల నుంచి సోమవారం నుంచి రాగులు కొనుగోలుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. జిల్లాలో 16,421 హెక్టార్లలో రాగులు సాగవుతుండగా ఈ ఏడాది రైతుల నుంచి 3 వేల నుంచి ఐదు వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యం నిర్దేశించింది. కిలో రూ.38.46 గిట్టుబాటు ధర ప్రకటించింది. జిల్లాలోని 25 ఆర్‌బీకేల్లో పౌరసరఫరాల శాఖ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసింది. జి.మాడుగుల మండలంలోని పాలమామిడి, జి.మాడుగుల, డుంబ్రిగుడ మండలంలో అరమ, కొర్రాయి, సాగర, పోతంగి, హుకుంపేట మండల కేంద్రం,పెదబయలు మండలంలో అడుగులపుట్టు, గంపరాయి, అరకులోయ మండలంలో కంఠబంసగుడ (పెదలబుడు-2), గన్నెల, కొత్తబల్లుగుడ కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటుచేశారు. అంతేకాకుండా ముంచంగిపుట్టు మండలంలో బంగారుమెట్ట, కించాయిపుట్టు, పెదగూడ, పాడేరు మండలంలో తుంపాడ, ఇరడాపల్లి, అనంతగిరి మండలంలో అనంతగిరి, ఎగువశోభ, చింతపల్లిలోని లోతుగెడ్డ, చింతపల్లి-1,తాజంగి-1, గూడెం కొత్తవీధి మండలంలో దేవరాపల్లి,జి.కే.వీధి-1,లక్కవరపుపేట రైతు భరోసా కేంద్రాల్లో రాగులు కొనుగోలు చేస్తారని వారు పేర్కొన్నారు.

# 3న మారేడుమిల్లిలో ఉచిత వైద్య శిబిరం

**మారేడుమిల్లి:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయి సేవా మందిరం వద్ద వచ్చే నెల మూడవ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి ప్రతినిధి యోగేశ్వరరావు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో కంటి, చర్మ వ్యాధులకు సంబంధించి వైద్యసేవలు అందిస్తారన్నారు. రాజమహేంద్రవరం ఆస్పత్రికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేస్తారని ఆయన వెల్లడించారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ఓషన్ సెయిలింగ్ రేస్ విజేత ఈఎన్‌సీ

**విశాఖ స్పోర్ట్స్:** ఇంటర్ కమాండ్ ఓషన్ సెయిలింగ్ రేస్‌లో తూర్పు నావికా దళం బోట్ మొదటి స్థానంలో నిలిచింది. ఈఎన్‌సీకి చెందిన 40 అడుగుల సెయిలింగ్ బోట్ సెయిలింగ్ వెసల్ నీల్కాంత్ ఓషన్ రేస్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ఈఎన్‌సీ బోట్ కెప్టెన్ కమాండర్ వినీత్ దోషి అతని బృందం అసాధారణమైన గ్రిట్, సముద్రయాన నైపుణ్యాలతో ఎత్తయిన సముద్రాలలో ప్రయాణించి ఈనెల 25న నాలుగు నౌకల్లో మొదటిగా గోవా చేరుకున్నారు. ఈ బృందం తమ ప్రయాణంలో 40 అడుగుల ఐఎన్‌ఎస్‌పి నీలకంఠతోనూ అసాధారణ ప్రదర్శన చేసింది.

# పరవశించిన పర్యాటకం



చెరువులవేనంలో పర్యాటకుల సందడి



జలతరంగిణి జలపాతం వద్ద వనభోజనాలు



వంజంగిలో అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు

**సాక్షి,పాడేరు:** జిల్లా వ్యాప్తంగా పర్యాటక ప్రాంతాల్లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది.ఇక్కడ ప్రకృతి, పొగమంచు, మేఘాల అందాలను వీక్షించేందుకు భారీగా తరలివచ్చారు. వంజంగిహిల్స్ పర్యాటకులతో కిక్కిరిసింది. తెల్లవారుజామునుంచి ఘాట్‌రోడ్డు పొడవునా వాహనాల రద్దీ నెలకొంది. సూర్యోదయం,కొండలను తాకిన పొగమంచు, పాలసముద్రాన్ని తలపించేలా మేఘాలు పర్యాటకులను అబ్బురపరిచాయి. వంజంగి కొండలపై గంటల తరబడి పర్యాటకులు ప్రకృతి అందాలను వీక్షించి పరవశించారు. వంజంగికి పర్యాటకులు భారీగా తరలిరావడంతో ఆదివారం ఒక్కరోజే టోల్‌గేట్ వద్ద రూ.80 వేల ఆదాయం వచ్చిందని నిర్వాహకులు తెలిపారు.

**చింతపల్లి రూరల్:** కార్తీకమాసంతోపాటు వీకెండ్ కావడంతో జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కళకళలాడాయి. మండలంలోని లంబసింగి చెరువులవేనంలో మంచు అందాలను తిలకించేందుకు ఆదివారం భారీగా తరలివచ్చారు. సూర్యోదయం, ప్రకృతి అందాలను వీక్షించారు.

**చాపరాయి జలపాతం వద్ద..**

**డుంబ్రిగుడ:** ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతానికి ఆదివారం మైదాన ప్రాంతం నుంచి భారీగా పర్యాటకులు తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు.

**మారేడుమిల్లి :** మండలానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తడంతో సందర్శనీయ ప్రాంతాలు కళకళలాడాయి. జలతరంగిణి అమృతధార జలపాతాలు, వాలీసుగ్రీవ్ వనమూలికల సంరక్షణ ప్రదేశం, జంగిల్ స్టార్, పాములేరు. గుడిస హిల్ టాప్, యూ పాయింట్‌కు భారీగా తరలివచ్చారు. జలతరంగిణి, అమృతధార జలపాతాల్లో యువత స్నానాలు చేస్తూ సందడి చేశారు. అటవీ ప్రాంతంలో వంటలు చేసుకొని కుటుంబ సమేతంగా వనభోజనాలు చేశారు.

**జెండాకొండపై..**

**హుకుంపేట:** ప్రముఖ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న సీతమ్మ పర్వతం (జెండాకొండ)పై ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. ఓలుబెడ్డ గ్రామం నుంచి వేకువ జామున కాలినడకన జెండాకొండపైకి చేరుకున్నారు. మంచు అందాలు తిలకించారు. ధింసారాళ్లు, తేనెపట్టు గుహలను సందర్శించారు.

**ముంచంగిపుట్టు:** ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం డుడుమ జలపాతానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు.సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు. డుడుమ జలపాతం, జోలాపుట్టు జలాశయం,మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం, దేసిమా మ్యూజియానికి పర్యాటకుల తాకిడి నెలకొంది.



జెండాకొండలో మంచు అందాలు తిలకిస్తున్న పర్యాటకులు



చాపరాయి జలపాతం వద్ద పర్యాటకుల సందడి



డుడుమ జలపాతం వ్యూపాయిట్‌కు తరలివచ్చిన పర్యాటకులు

# నమో నారసింహ

- ఘనంగా శ్రీ నృసింహ దీక్షలు ప్రారంభం
- 350 మందికి శాస్త్రోక్తంగా మాలధారణ
- డిసెంబర్ 4 నుంచి 32 రోజుల దీక్ష ప్రారంభం



దీక్ష తీసుకునేందుకు చందనం రంగు వస్త్రాలు ధరించి వచ్చిన భక్తులు



వరాహ, నారసింహ, ప్రహ్లాదుని అలంకరణ

**సింహాచలం:** శ్రీ నృసింహ దీక్షలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. 41 రోజుల మండల దీక్ష తీసుకునేందుకు వచ్చిన సుమారు 350 మంది దీక్షాధారులకు సింహగిరిపై దేవస్థానం వైదిక, అధికార వర్గాలు శాస్త్రోక్తంగా మాలధారణ చేశారు. సింహగిరిపై రాజగోపురం పక్కన మాడవీధిలో ప్రత్యేకంగా వేదిక ఏర్పాటు చేసి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ప్రతిమలను ఉంచారు. దేవస్థానం అర్చకులు, అధికారులు మేళతాళాలు, వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయం నుంచి తులసి మాలలను ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకొచ్చారు. స్వామి చెంతన తులసి మాలలను ఉంచి అర్చకులు విష్వక్సేన పూజ పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామి అష్టోత్తర శతనామావళిని దీక్షాధారులందరిచేత పఠింపజేశారు. అనంతరం దీక్షాధారులకు మాలధారణ చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్ దీక్ష నియమాలను వివరించారు. దేవస్థానం తరఫున ఈవో ఎస్. శ్రీనివాసమూర్తి దీక్ష వస్త్రాలు, క్షేత్ర పురాణం కరపత్రాలను అందజేశారు. ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు సాతులూరి నరసింహాచార్యులు, వేద పండితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీక్ష తీసుకున్నవారిలో సింహాచలం ప్రాంతానికి చందన పెరుమాళ్ పీఠం గురుస్వామి సానబోయిన రాజుతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిశా, హైదరాబాద్, విశాఖ ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన భక్తులు ఉన్నారు. దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, దొడ్డి రమణ, ముదుండి రాజేశ్వరి, డిప్యూటీ ఈవో సుజాత, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవోలు నరసింహరాజు, రమణమూర్తి, పాలూరి నరసింగరావు, పీఆర్వో నాయుడు, సింహాద్రి మఠం గురుస్వామి కె.సురేంద్రస్వామి పాల్గొన్నారు. కాగా చందన పెరుమాళ్ పీఠం దీక్షాధారులు వరాహ, నృసింహ వేషధారణాల్లో అలరించారు. డిసెంబర్ 4 నుంచి 32 రోజుల నృసింహ దీక్షలు ప్రారంభమవుతాయని స్థానాచార్యులు తెలిపారు. ఆ రోజు కూడా సింహగిరిపై దీక్షాధారణ కార్యక్రమం ఉంటుందన్నారు.

# ఫిబ్రవరిలో రేలా పండగ



సమావేశంలో మాట్లాడుతున్న పరిషత్ నాయకులు

**చింతూరు:** వచ్చే ఏడాది ఫిబ్రవరి 10,11 తేదీల్లో ఆదివాసీ సాంస్కృతిక సమ్మేళనమైన రేల పండగను చింతూరులో నిర్వహించనున్నట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పులి వీరయ్య తెలిపారు. ఆదివారం చింతూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీ తెగల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా తమ సంఘం కృషి చేస్తోందన్నారు. దీనిలో భాగంగానే ఫిబ్రవరిలో ఐదవ తేదీన రేలా పండగను నిర్వహిస్తున్నామని, ప్రతిఒక్కరూ దీనిని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆదివాసీ యువత ఉద్యోగ భద్రత కోసం ప్రత్యేక చట్టం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పరిషత్ నాయకులు కారం రవి, పూసం శ్రీను, తిమ్మ సాయి, కణితి గణేష్, సోడె మురళి, నారాయణ, ముత్తయ్య, నాగేశ్వరరావు, రాజ్ కుమార్, కన్నయ్య పాల్గొన్నారు.

# అంబేడ్కర్ ఆశయసాధనే లక్ష్యంగా పాలన



భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాడేరు, అరకు, అడ్డతీగలలో స్థానిక ఎమ్మెల్యేలు భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 8లో

## క్లుప్తంగా

### బొర్రాకు పర్యాటకుల తాకిడి



పర్యాటకులతో కళకళలాడుతున్న సరియా జలపాతం

అనంతగిరి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. గుహలను 4500 మంది తిలకించగా, రూ.3.75 లక్షల ఆదాయం వచ్చినట్టు మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు. సరియా, తాటిగూడ, చిట్టంపాడు, కటికి జలపాతాలు వద్ద పర్యాటకులు సందడి చేశారు. అరకు–విశాఖ ప్రధాన రహదారి ఆనుకుని ఉన్న డముకు, గాలికొండ వ్యూపాయింట్లు పర్యాటకులతో కళకళలాడాయి.

### ఘనంగా శోభాయాత్ర



అక్షింతలతో ఊరేగింపు

సాక్షి,పాడేరు: పవిత్ర పుణ్యస్థలం అయోధ్యలో శ్రీరామునికి పూజ చేసిన అక్షింతలు ఆదివారం జిల్లా కేంద్రం పాడేరు చేరుకున్నాయి. శ్రీరాముని పూజ అక్షింతలతో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కూడ రామకృష్ణ పరమహంస ఆధ్వర్యంలో మండలంలోని కరకపుట్టు జంక్షన్ నుంచి సూకురుపుట్టులోని సూర్యనారాయణమూర్తి ఆలయం వరకు గిరిజనులు శోభయాత్ర నిర్వహించారు.

### గుంటూరులో ఆధునిక వ్యవసాయ సదస్సు

బుచ్చెయ్యపేట: గుంటూరు ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయంలో వచ్చే నెల 3 నుంచి 5వ తేదీ వరకు ఆధునిక వ్యవసాయ సదస్సు నిర్వహించనున్నట్లు కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధాన శాస్త్రవేత్త కె.రాజ్‌కుమార్ తెలిపారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మెరుగైన యాజమాన్య పద్ధతులు, అధిక దిగుబడులపై అవగాహన కల్పిస్తారన్నారు. రైతులు కేవీకేలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

# ఆశాకిరణం లాంగ్‌లైనర్

- సాధారణ మత్స్యకారులకు 50 శాతం రాయితీ
- బోటు ప్రమాద బాధితులకు ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ
- వీటి కొనుగోలుకు బ్యాంకుల నుంచి రుణ సదుపాయం
- ఈ బోట్లతో ఆదాయం పెంపునకు దోహదం



లాంగ్‌లైనర్ బోటు

సాక్షి, విశాఖపట్నం : మత్స్యకారులకు ఆదాయాన్ని తెచ్చి పెట్టే బోట్లలో లాంగ్‌లైనర్లకు పెట్టింది పేరు. సాధారణ చేపల వేటకు మెకనైజ్డ్ (మర) బోట్లను వినియోగిస్తారు. వీటి ద్వారా చేపలతో పాటు రొయ్యల వేట సాగిస్తారు. ఇలాంటి మెకనైజ్డ్ బోట్లు విశాఖలో 690 వరకు ఉన్నాయి. ఇవి కాకుండా మరో 150 వరకు లాంగ్‌లైనర్ బోట్లున్నాయి. ట్యూనా వంటి పెద్ద చేపల వేట కోసం వీటిని ఉపయోగిస్తారు. మెకనైజ్డ్ బోట్లు సముద్రంలో వలలు వేసి చేపలు, రొయ్యలను, హుక్ (గాలం)ల ద్వారా ట్యూనా చేపలను వేటాడతారు. మెకనైజ్డ్ బోటు ఖరీదు రూ.30 నుంచి 60 లక్షల వరకు ఉంటే.. లాంగ్‌లైనర్ బోటు ఖరీదు రూ.80 నుంచి లక్ష వరకు ఉంటుంది. వీటిలో ఫైబర్‌తో తయారైనది రూ.80 లక్షలు, స్టీల్‌తో తయారు చేసినది రూ.కోటి అవుతుంది. విశాఖ ప్రాంతానికి స్టీల్ లాంగ్‌లైనర్ బోట్లు అనుకూలంగా లేకపోవడంతో ఫైబర్ బోట్లకే మత్స్యకారులు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో గత ఆదివారం విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంలో 49 మెకనైజ్డ్ బోట్లు దగ్ధమయ్యాయి. వీటిలో 30 పూర్తిగా, 19 బోట్లు పాక్షికంగా కాలిపోయాయి. స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రమాదం జరిగిన మూడు రోజుల్లోనే బోట్లకు వాటిల్లిన నష్టంలో 80 శాతం పరిహారంగా రూ.7.11 కోట్లను సంబంధిత బోటు యజమానులకు చెల్లించింది. ఇలా గరిష్టంగా రూ.32.80 లక్షలు, కనిష్టంగా రూ.2.40 లక్షల సొమ్మును బాధితులకు పంపిణీ చేసింది.

### ప్రయోజనాలివీ..

ఆదాయాన్ని తెచ్చిపెట్టే లాంగ్‌లైనర్లపై కొన్నాళ్లుగా మత్స్యకారుల్లో ఆసక్తి ఉంది. ఈ బోట్లతో డీప్ సీలో హుక్‌ల ద్వారా వేట సాగిస్తారు. వేటాడిన చేపలు రోజుల తరబడి నిల్వ ఉండేందుకు బోట్లలో ఐదారు టన్నుల ఐస్‌ను తీసుకెళ్తారు. లాంగ్‌లైనర్లలో నీటిని 1–2 డిగ్రీల శీతలీకరణ చేసే సాంకేతికత ఉంటుంది. గడ్డకట్టే ఆ నీటిలో చేపలను నిల్వ ఉంచుకోవచ్చు. అందువల్ల ఇక ఐస్ అవసరం ఉండదు. ట్యూనాలు వంటి ఖరీదైన ఈ చేపల పొట్ట భాగాన్ని తొలగించి వాటిలో ఉంచడం ద్వారా సెష్మీగ్రేడ్ ఫిష్‌గా తయారవుతుంది. వీటికి విదేశాల్లో డిమాండ్ ఎక్కువగా ఉండడం వల్ల మంచి ధర పలుకుతుంది. ఐస్‌కయ్యే పెట్టుబడి కూడా తగ్గుతుంది. మెకనైజ్డ్ బోట్లకంటే లాంగ్ లైనర్‌లకు డీజిల్ వినియోగం తక్కువ. ఇవన్నీ బోటు యజమానికి లాభదాయకమవుతాయి. ప్రస్తుతం విశాఖ నుంచి వేటకు వెళ్లే లాంగ్‌లైనర్ బోట్లకు ఈ సదుపాయం లేదు. కొత్తగా కొనుగోలు చేసే వాటికి శీతలీకరణ సదుపాయం ఉంటుంది. ఇటీవల లాంగ్‌లైనర్ బోట్ల తయారీపై చెన్నైకి చెందిన సంస్థ ప్రతినిధులతో చర్చించామని, రూ.80 లక్షలకు ఫైబర్ బోటు ఇవ్వడానికి ముందుకొచ్చారని, దీనిపై మత్స్యశాఖ ఉన్నతాధికారులకు నివేదించామని జిల్లా మత్స్యశాఖ అధికారి జి.విజయ 'సాక్షి'కి చెప్పారు.

### లాంగ్‌లైనర్‌ల కొనుగోలుకు చేయూత

లాంగ్‌లైనర్ బోట్ల కొనుగోలుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై), బ్లూ రివల్యూషన్ పథకాల్లో పురుష మత్స్యకారులకు 50 శాతం, మహిళా మత్స్యకారులకు 60 శాతం వరకు సబ్సిడీగా చెల్లిస్తోంది. వీటిలో రాష్ట్ర ప్రభుత్వ వాటా 12 శాతం ఉంది. మిగిలిన సొమ్మును బ్యాంకులు రుణంగా ఇస్తాయి. కొంత సొమ్మును లబ్ధిదారుని వాటాగా సమకూర్చుకోవలసి ఉంటుంది. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన మెకనైజ్డ్ బోట్ల యజమానులు ఈ లాంగ్‌లైనర్ బోట్లు కొనుగోలుకు ముందుకు వస్తే వాటికి 75 శాతం సబ్సిడీ చెల్లించేలా త్వరలో జీవో జారీ చేయనున్నట్టు మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు వారికి పరిహారం పంపిణీ చేసే కార్యక్రమంలో ప్రకటించారు. స్టీల్ లాంగ్‌లైనర్‌కు రూ.కోటి, ఫైబర్ లాంగ్‌లైనర్‌కు రూ.80 లక్షల వరకు వ్యయం అవుతుంది. విశాఖ వాతావరణానికి స్టీల్ లాంగ్‌లైనర్‌లు అనుకూలం కాదన్న భావన మత్స్యకారుల్లో ఉంది. దీంతో ఫైబర్ బోట్లను కొనుగోలు చేసే వారికి రూ.60 లక్షల వరకు సబ్సిడీ దక్కనుంది. మిగిలిన సొమ్ములో కొంత బ్యాంకులు రుణం ఇస్తాయి. లబ్ధిదారుని వాటాగా బోట్ల పరిహారంగా ఇచ్చిన సొమ్ములో అవసరమైన మేరకు చెల్లిస్తే సరిపోతుంది. సరికొత్త బోటు మత్స్యకారుని సొంతమవుతుంది. ప్రభుత్వం ఇస్తున్న ఈ వెసులుబాటును వినియోగించుకోవాలన్న యోచనలో మత్స్యకారులున్నారు.

### నేవీ డేకు ఏర్పాట్లు షురూ..

బీచ్‌రోడ్డు: నౌకాదళ దినోత్సవం పురస్కరించుకుని తూర్పు నౌకాదళం ఆదివారం బీచ్‌రోడ్డులో ఏర్పాట్లు ప్రారంభించింది. నౌకాదళం శక్తి, సామర్థ్యాలు ప్రజలకు ప్రత్యక్షంగా చూపించడానికి వీలుగా ఏటా డిసెంబర్4న సముద్రంలో విన్యాసాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 28, 30వ తేదీల్లో రిహార్సల్స్, డిసెంబర్ 2న ఫైనల్ రిహార్సల్స్ చేయనున్నారు. డిసెంబరు 4న జరిగే ప్రధాన వేడుకకు నేవీ ఉన్నతాధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరవుతారు. ఈ వేడుకలను తిలకించేందుకు వేల సంఖ్యలో ప్రజలు సాగర తీరానికి చేరుకుంటారు. ఈ నేపథ్యంలో ఆర్.కె.బీచ్ నుంచి వైఎంసీఏ వరకు స్క్రీన్లు, సౌండ్ సిస్టమ్, గ్యాలరీలను సిద్ధం చేస్తున్నారు. విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా ప్రధాన వేదికను తీర్చిదిద్దుతున్నారు.

### నేడు ఎన్నికల జాబితా పరిశీలకుడు రాక

మహారాణిపేట: ఉత్తరాంధ్ర జిల్లాల ఎన్నికల జాబితా పరిశీలకుడుగా (రోల్ అబ్జర్వర్) నియమితులైన ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు సోమవారం విశాఖ వస్తున్నారు. ఉదయం 9 గంటలకు విమానాశ్రయానికి చేరుకొని జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేస్తారు. పోలింగ్ కేంద్రాలను ఓటరు జాబితాలను తనిఖీ చేస్తారు. అనంతరం విజయనగరం వెళ్తారు. ఈనెల 29 పార్వతీపురం పర్యటన అనంతరం విశాఖ జిల్లాకు చేరుకుంటారు. ఆరోజు సాయంత్రం 3.30 నుంచి 4.30 వరకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు.

# భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- శివాలయాల్లో దీపారాధన
- భక్తులతో కళకళలాడిన శైవక్షేత్రాలు



పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



పాడేరులో ఆకాశదీపంలో ఏర్పాటు చేస్తున్న భక్తులు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో భక్తులు పవిత్ర కార్తీక పౌర్ణమిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వేకువజాము నుంచే పౌర్ణమి ఉపవాసాలను ఆచరించారు. మర్రి ఆకులు, ఊడలు, ఇతర పూజా సామాగ్రికి సంబంధించిన పత్రిని సేకరించారు. సాయంత్రం తమ కుటుంబాలతో ఇళ్ల వద్ద కార్తీక పౌర్ణమి పూజలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం మత్స్యగుండం, బొర్రాగుహలు, అరకులోయని భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి, పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి, త్రిలింగేశ్వరస్వామి శివాలయాలన్నీ భక్తులతో కళకళలాడాయి. శివనామస్మరణతో మార్మోగాయి. ఉదయం, సాయంత్రం భక్తులు శివాలయాలను సందర్శించి, పరమేశ్వరుడికి అభిషేకాలు జరుపుకున్నారు. పాతపాడేరు, లగిశపల్లి, తామరాపల్లి, వంజంగి, గెడ్డంపుట్టు, తురాయిమెట్ట, జి.మాడుగుల, అంతర్ల శివాలయాల్లోను కార్తీక పౌర్ణమి పూజలు జరిపారు. సాయంత్రం నుంచి అన్ని శివాలయాల్లోను మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించారు.

### 108 దీపాల కుందె ప్రారంభం

పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో 108 దీపాల ఇత్తడి కుందెను కార్తీక పౌర్ణమితో ఆదివారం రాత్రి ప్రారంభించారు.పాడేరుకు చెందిన వ్యాపారి రొబ్బి నరసింగరావు(చిన్న)ఉమామహేశ్వరి,రిటైర్డ్ ఆర్‌అండ్‌బీ ఉద్యోగి బొడ్డెటి త్రినాథరావు, కోటేశ్వరమ్మ దంపతులు సంయుక్తంగా రూ.42వేల ఖర్చుతో ఈ దీపం కుందెను ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయానికి అందుబాటులోకి తీసుకొచ్చారు.ఆలయ పూజారి రామం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. 108 దీపాలను వెలిగించారు.అనంతరం ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ఆధ్యాత్మిక కమిటీ ప్రతినిధులు ఉప్పల వెంకటరత్నం, కుర్తాడి రామారావు, కొట్టగుళ్లి రామారావులు దీపం కుందె దాతలకు శాలువా కప్పి ఉమానీలకంఠేశ్వరస్వామి చిత్రపటాలను జ్ఞాపికగా అందజేశారు. ఉప్పల వెంకటరత్నం ,వైదేహి దంపతులు ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

### భక్తిశ్రద్ధలతో కార్తీక నోములు

రాజవొమ్మంగి: కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని మహిళలు కార్తీక నోము ఆచరించారు. ఉపవాసం ఆచరించిన భక్తులు ఆరుబయట తులసి కోట వద్ద పీఠం ఏర్పాటు చేసి పూజలు చేశారు. ఉసిరి కాయలపై వత్తులు పెట్టి వెలిగించారు. తెల్లని పూలు, పండ్లు, చలివిడి, కొబ్బరికాయలు సమర్పించారు. పరమాన్నం తదితర రకరకాల వంటలతో నైవైద్యం నివేదించారు. పౌర్ణమి చంద్రునికి పూజలు చేసి ఉపవాస దీక్ష విరమించారు.



పాడేరులోని ఓ ఇంటిలో కార్తీక పౌర్ణమి జరుపుకుంటున్న సిద్ధనాతి కుటుంబం



రాజవొమ్మంగి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



# వెదుళ్ల సంబరానికి వేళాయె

రాంబిల్లి: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన దిమిలి దల్లమాంబ జాతర మంగళవారం జరగనుంది. ఈ జాతరలో వెదుళ్ల ఉత్సవం ప్రత్యేకత చాటనుంది. భక్తుల కొంగు బంగారంగా పేరొందిన దల్లమాంబ జాతరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు సర్పంచ్ బంగారు చిలుకు, ఉప సర్పంచ్ మురళీకృష్ణ తెలిపారు. ఈ దల్లమాంబ జాతర, వెదుళ్ల సంబరం చూసేందుకు పలు ప్రాంతాల్లో స్థిరపడిన భక్త జనం భారీగా దిమిలికి తరలివస్తారు.

### చారిత్రక నేపథ్యం

దిమిలిలో దల్లమాంబ అమ్మవారి జాతరకు చారిత్రక నేపథ్యం ఉంది. పూర్వం మరాఠి ముఠా గుర్రాలపై వచ్చి గ్రామాలపై దాడులు చేస్తూ దౌర్జన్యాలకు పాల్పడేది. ఆ క్రమంలో ఓ బ్రాహ్మణ యువతి దల్లమాంబ శారదనది ఒడ్డున స్నేహితురాళ్లతో ఆడుకుంటుండగా గుర్రాలపై మరాఠి దండు రావడం గమనించింది. వారి చేతికి చిక్కడం ఇష్టం లేని దల్లమాంబ శారద నదిలో దూకి ప్రాణత్యాగం చేసింది. దీంతో గ్రామస్తుల్లో చైతన్యం వచ్చింది. ధైర్యంగా వెదుళ్ల చేతబూని మరాఠి దండుపై ఎదురు దాడికి దిగారు. దీంతో అప్పటి నుంచి వారి ఆగడాలు ఆగిపోయాయని చరిత్ర చెబుతుంది. కొన్నాళ్లకు అమ్మవారు స్థానిక రైతుకు స్వప్నంలో కనిపించి తనకు గుడి కట్టించి పూజలు చేయాలని చెప్పడంతో స్థానికులు ఆలయం కట్టించి పూజలు చేయడం ప్రారంభించారు. తొలుత ఇక్కడ రాతి విగ్రహం ఉండేది. తర్వాత భారీ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ చారిత్రిక నేపథ్యంలో రెండేళ్లకోసారి నిర్వహించే దల్లమాంబ జాతరలో వెదుళ్ల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. గుంపులు గుంపులుగా వెదుళ్ల చేతబూని కొందరు కూర్చోగా చుట్టూ వెదుళ్లతో కూర్చొన్న వారి వెదుళ్ల గుంపుపై కొడతుంటారు. వెదుళ్ల ఉత్సవంలో పాల్గొన్నప్పటికీ గాయాలు కాకపోవడం అమ్మవారి మహత్యంగా భక్తులు చెబుతారు.

### జాతరకు ఘనంగా ఏర్పాట్లు

దల్లమాంబ జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం రాత్రికి శారద నది ఒడ్డున భారీగా బాణసంచా వెలిగిస్తారు. ఆలయం సహా గ్రామంలో విద్యుద్దీపాలంకరణ చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

### భారీ బందోబస్తు

జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నియంత్రించేందుకు సీఐ గఫూర్ పర్యవేక్షణలో రాంబిల్లి ఎస్ఐ దీనబంధు ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# వైభవంగా జ్వాలా తోరణం



కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం రాత్రి కొత్త వెంకోజీపాలెంలోని శ్రీ జ్ఞానలింగేశ్వర ఆలయం, పీతలవానిపాలెంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో జ్వాలా తోరణ మహోత్సవం వైభవంగా జరిగింది. శ్రీ జ్ఞానలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు ఆరవెల్లి సూర్యప్రకాశ్ శర్మ, ఆధ్వర్యంలో భక్తులకు విశేష అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. ఉపవాసం ఉన్న మహిళలు సాయంత్రం ఆలయానికి తరలివచ్చి ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేశారు. అనంతరం జ్వాలా తోరణ మహోత్సవం నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి.. మూడు సార్లు ప్రదక్షిణ చేశారు. వెలుగుతున్న జ్వాలా తోరణం కింద బూడిదను నుదుటిన పెట్టుకున్నారు. భక్తుల శివ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. హెచ్‌బీకాలనీ, ఇసుకతోటలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

– మద్దిలపాలెం

# అంబేడ్కర్ ఆశయసాధనే లక్ష్యంగా పాలన

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- ఘనంగా భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం
- అంబేడ్కర్‌కు ఘన నివాళి



అడ్డతీగలలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు



అరకులోయలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే ఫాల్గుణ, పార్టీ శ్రేణులు

సాక్షి,పాడేరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు.భారత రాజ్యాంగ అమోద దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.అంబేడ్కర్ విగ్రహానికి ఆమెతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత కృషితో మనమంతా అభివృద్ధి ఫలాలు అనుభవిస్తున్నామన్నారు. బడుగు, బలహీనవర్గాలకు రిజర్వేషన్లు అమలుతో దేశంలో సామాజిక ఆర్థిక సాధికారిత సాధ్యమైందన్నారు. అంబేడ్కర్ సిద్ధాంతాల మేరకు రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీసామాజిక తరగతులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించిన ఘనత సీఎం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర,మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, ఉపాధ్యక్షుడు పశువుల సత్యనారాయణ, పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు,డైరెక్టర్లు లకే రామసత్యవతి,గబ్బాడ రాజారావు,కొండబాబు.పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు, సభ్యుడు సిరగం దశమూర్తి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

### రాజ్యాంగంతో హక్కులకు రక్షణ

అడ్డతీగల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా ప్రతి ఒక్కరి హక్కులకు రక్షణ ఏర్పడిందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు అన్నారు. భారత రాజ్యాంగం ఆమోద దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం అడ్డతీగలలో వారు అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనాడు నిమ్న వర్గాలు అనుభవిస్తున్న వెనుకబాటుతనం, వివక్షకు విరుగుడుగా భారత రాజ్యాంగంలో అనేక హక్కులు కల్పించడంతో పాటు బాధ్యతలు వివరించారన్నారు. కాలక్రమంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఎంతో అభివృద్ధి సాధించారన్నారు. సామాజికంగా హక్కులు పరిరక్షణకు రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలకు అనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతిని కాంక్షిస్తూ అమలు చేస్తున్నారన్నారు.రాజ్యాంగంలో నిక్షిప్తమై ఉన్న కీలకమైన అంశాలను ప్రతి ఒక్కరూ తెలుసుకుని వాటిని ఆచరిస్తూ సమాజాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల సత్యనారాయణ, ఎంపీపీ బొడ్డపాటి రాఘవ పాల్గొన్నారు.

### బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి..

అరకులోయ టౌన్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బీఆర్ అంబేడ్కర్ అని అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ అన్నారు.భారత రాజ్యాంగ అమోద దినోత్సవంలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల రిజర్వేషన్ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చలువేనన్నారు. రాజ్యాంగంలో రిజర్వేషన్లు, చట్టాలు, హక్కులు పొందుపరచడం వల్లే నేడు బడుగు, బలహీన వర్గాల ప్రజలు రిజర్వేషన్ అనుభవిస్తున్నారన్నారు. అప్పట్లో రిజర్వేషన్ కల్పించి ఉండకపోతే ఇంతటి హక్కులు తమకు ఉండేవి కాదన్నారు. హక్కులు, రిజర్వేషన్ కల్పించిన అంబేడ్కర్‌కు మనమంతా రుణపడి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అరకులోయ, డుంబ్రిగుడ ఎంపీపీలు రంజపల్లి ఉషారాణి, బాకా ఈశ్వరి, డంబ్రిగుడ జెడ్పీటీసీ చటారి జానకమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి శెట్టి గంగాధర స్వామి, బీఎస్ఎన్ఎల్ ఎడ్వైజరీ కమిటీ సభ్యుడు శెట్టి వెంకటరావు, మండల కన్వీనర్ సంపత్ కుమార్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు పాల్గొన్నారు.